17 నుంచి స్వస్థ నారీ స్వశక్తు పరివార్ అభియాన్



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

అత్తాపూర్: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్థ నారి స్వశక్తు పరివార్ అభియాన్(అతివా ఆరోగ్యమస్తు) కార్యక్రమాన్ని 17 నుంచి అక్టోబర్ 2 వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు మెగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ గీత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ రాధిక, డాక్టర్ పూనమ్, డాక్టర్ రాకేష్, డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎదురులేని శక్తిగా బీజేపీ



బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న అడికే రాజు

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్రంలో బీజేపీ ఎదురులేని శక్తిగా ఎదుగుతుందని రాష్ట్ర బీసీ మోర్చా నాయకులు అడికే రాజు అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్‌ను ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధానిగా నరేంద్రమోదీ దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలను, రాష్ట్ర ప్రభుత్వం తమ సొంతగా అందిస్తున్నట్లు తప్పుడు ప్రచారాలు చేసుకుంటుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చడం లేదన్నారు. కేవలం మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తూ వస్తుందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చిన బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి



సింహయ్య(ఫైల్)

మియాపూర్: భవనం మూడో అంతస్తు వద్ద పనిచేస్తుండగా ఓ వ్యక్తి కిందపడి గాయాలపాలై మృతిచెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన డి.సింహయ్య(46) భార్య కుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి నగరంలోని యూసఫ్‌గూడ జవహర్‌కాలనీలో నివాసముంటున్నారు. స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. సింహయ్య మంగళవారం మధ్యాహ్నం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్లోకుల్ ప్లాట్స్ కాలనీలో ఓ సూపర్ మార్కెట్ భవనం వెనుకవైపు మూడవ అంతస్తు వద్ద భవనానికి సంబంధించిన వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో సింహయ్య తలకు, శరీర భాగాలకు గాయాలు కావడంతో అక్కడి స్థానికులు కేపీహెచ్‌బీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సింహయ్య మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షేక్‌పేట్‌లో భాగవత సప్తాహ ప్రవచనం

గోల్కొండ: షేక్‌పేట్‌లోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ నిర్వహణలో భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వ్యాస రచయిత సముద్రాల శఠగోపాచార్యులు ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవచిస్తు భక్తితో భాగవతాన్ని ఏడు రోజులు వింటే లెక్కలేనన్ని శుభాలు కలుగుతాయన్నారు. సుఖసంతోషాలు దక్కుతాయని సకల దోషాలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమాన్ని భూ విజన్ పక్షపత్రిక వ్యవస్థాపకులు దేవులపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభించారు. సభా ప్రార్థనగా పోతన భాగవతంలోని పద్యాలను రాగయుక్తంగా ఆయన ఆలపించి భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి అశోక్‌కుమార్, సభ్యులు శ్రీనివాసులు, అర్చకులు రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



ఈవీఎం గొడౌన్‌ను సందర్శించి తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రాజేంద్రనగర్: ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు. రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ ఈవీఎం గోడౌన్స్‌ను మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఈవీఎం గోడౌన్‌ను త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని గదులను అదనపు కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ గోడౌన్ సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించారు. అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహసీల్దార్, వేర్ హౌస్ ఇన్‌చార్జి బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల ఫోరం అధ్యక్షుడిగా మల్లేశ్‌ముదిరాజ్



మల్లేశ్ ముదిరాజ్



వేణుగౌడ్

మణికొండ: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఫోరం అధ్యక్షుడిగా నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామానికి చెందిన గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. మంగళవారం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమావేశమైన అన్ని మార్కెట్ కమిటీల చైర్మన్లు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. మాధవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బి. ఆంజనేయులను ఎన్నుకున్నట్టు ఉపాధ్యక్షుడు తెలిపారు.

నాలాలను పునరుద్ధరించాలి



ముష్కి చెరువును పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: శేరిలింగంపల్లి, గండిపేట మండలాల్లో గొలుసుకట్టుగా ఉన్న చెరువులు, నాలాలను పునరుద్ధరించి వాటిల్లో మురికి నీరు కలపకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అధ్యక్షుడు డి. సీతారాం ఆధ్వర్యంలో నాయకులు ముష్కిన్ చెరువు, బుల్కాపూర్ నాలా పరివాహకంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని ఖాజాగూడ, భగీరథమ్మ చెరువులు నిండి ఆ నీరు నాలా ద్వారా ముష్కిన్ చెరువు, పండెన్‌వాగుకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి మూసీనదికి వెళ్తుందన్నారు. ప్రస్తుతం బుల్కాపూర్ నాలాను ఆనుకొని అనేక నిర్మాణాలు వచ్చి అందులో రాళ్లు, మట్టి పోయటంతో నిర్వీర్యం అయిందన్నారు. దాన్ని పునరుద్ధరించకపోతే కామారెడ్డిలో కుంభవృష్టి వర్షాలు కురిస్తే మణికొండ మున్సిపాలిటీ ప్రాంతం పూర్తిగా మునిగి ఆస్తి, ప్రాణనష్టం జరుగుతుందన్నారు. బుల్కాపూర్ నాలా పక్కన ఉన్న ఓ బిల్డర్ ప్రభుత్వ భూమిలో వంద అడుగుల రోడ్డు పేరుతో నాలాను ఆక్రమించారని, వారికి అనుమతులు, ఎన్ఓసీలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.నరేందర్, ఎస్. శ్రీకాంత్, కిరణ్, బి.శ్రీధర్, ఆరీఫ్, సుమనళిని, బాబురావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు

అత్తాపూర్: మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 14న జరిగే మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అవగాహన కల్పించారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తారని వారికి ఊరేగింపు నిర్వహించే వారు సహకరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్, వార్డు సభ్యులు మహ్మద్ తాహేర్ తదితరులున్నారు.

డివైడర్‌లో చెట్లు నాటండి



అందవిహీనంగా మారిన హసన్‌నగర్ డివైడర్

శాస్త్రిపురం: డివైడర్‌ను అధికారులు పట్టించుకోకపోవడంతో కలలవిహీనంగా మారింది. డివైడర్‌లో చెట్లు పెట్టడం అధికారులు మర్చిపోయారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం డివిజన్ హసన్‌నగర్ ప్రధాన రహదారిపై సుందరీకరణలో భాగంగా అధికారులు డివైడర్‌ను నిర్మించారు. కానీ అందులో చెట్లను ఏర్పాటు చేయకపోవడంతో అందవిహీనంగా మారింది. డివైడర్‌లో ఎర్ర మట్టిని పోసి చెట్లను ఏర్పాటు చేస్తే పచ్చదనంతో పాటు హసన్‌నగర్ రహదారి అందంగా కనిపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన డివైడర్ వృథాగా ఉండడంతో మట్టి, చెత్తచెదారం, జంతువులకు ఆవాసంగా మారుతుందని ఫలితంగా వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు వాపోతున్నారు. గతంలో జీహెచ్ఎంసీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సైతం డివైడర్‌లో చెట్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరామని హర్టికల్చర్ అధికారులతో చర్చించి చెట్లను నాటుతామన్న అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని హసన్‌నగర్ కాలనీల ప్రజలు తెలిపారు. వానకాలం కావడంతో అధికారులు డివైడర్‌లో మట్టి పోసి చెట్లు పెడితే త్వరగా నాటుకుంటాయని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని హసన్‌నగర్ రహదారిలోని డివైడర్‌లో చెట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెలుగుతున్న విద్యుత్ దీపాలు



నానక్‌రాంగూడ రేషన్‌షాప్ బస్తీలో వెలుగుతున్న వీధిదీపాలు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రేషన్‌షాప్ బస్తీలో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. దీంతో బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలను జీహెచ్ఎంసీ బృందం ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించి విద్యుత్ దీపాలకున్న బల్బుల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడంతో అవి వెలుగడం ఆరంభించాయి. 'సాక్షి' శేరిలింగంపల్లి జోన్‌లో ఆదివారం 'వీధి దీపాలు వెలుగడం లేదు' అనే శీర్షిక వచ్చిన వార్తకు జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సిబ్బంది చేత వెంటనే బల్బులను ఏర్పాటు చేయడంతో రాత్రిపూట వెలుగులు వచ్చాయని స్థానిక నాయకులు సంజీవరెడ్డి మంగళవారం తెలిపారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వీవీపీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బాబురావు, హోంగార్డ్ నజీముద్దీన్ మాట్లాడుతూ..18 ఏళ్ల లోపు మైనర్లు వాహ నాలు నడపరాదన్నారు. కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా వాహనాలు రోడ్ల పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల ఎండీ ముజుతబా ఖాన్, రిలేషన్‌షిప్ మేనేజర్ అజమత్, హైస్కూల్ ఇన్‌చార్జి గౌస్‌పాషా, అడ్మిన్‌లు అఫ్సా, రహీలా పాల్గొన్నారు.

వ్యవస్థాపకులుగా విద్యార్థులు ఎదగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు

శంషాబాద్: విద్యార్థులు వ్యవస్థాపక రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని, వ్యవస్థాపకులుగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వ్యవస్థాపక రంగంపై ఉన్న అవకాశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఉన్న అవకాశాలు, సమస్యలు, పరిష్కారాలను సూచించారు. కార్యక్రమంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సేవలు, సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు రోజా, సుధాకర్ పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉమ్రా యాత్రికులకు స్వాగతం పలుకుతున్న కుటుంబసభ్యులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన యాభైమందికి పైగా యాత్రికులు ఉమ్రా యాత్రను పూర్తి చేసుకొని మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, మిత్రులు ఆత్మీయ స్వాగతం పలికారు. పూలమాలలు వేసి సత్కరించారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

ఒకరు మృతి, మరో ముగ్గురికి గాయాలు

మియాపూర్: జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్‌లో నివాసముంటున్న రవి నాయుడు(25) స్థానికంగా ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి రవినాయుడు స్నేహితులైనా సాయికుమార్, ప్రసాద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బీహెచ్ఈఎల్ వైపు టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై టిఫిన్ చేసి మియాపూర్ వైపు వస్తుండగా దీప్తీశ్రీనగర్ సమీపంలో మదీనగూడ జాతీయ రహదారిపై అదుపుతప్పి మరో ద్విచక్రవాహనానికి ఢీకొన్నారు. దీంతో వారు కిందపడగా తీవ్ర గాయాలైయ్యాయి. అక్కడి స్థానికులు దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రవి నాయుడు మృతి చెందినట్లు తెలిపారు. సాయికుమార్, ప్రసాద్‌కు స్వల్పగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో ద్విచక్ర వాహనాదారుడికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శని, ఆదివారాల్లో తెలంగాణ ప్రసిద్ధ ఆలయాలకు ప్రత్యేక బస్సు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్-1 డిపో పరిధిలో శని, ఆదివారాల్లో తెలంగాణలో ప్రసిద్ధ ఆలయాల తీర్థ యాత్రల నిమిత్తం రాజధాని ఏసీ బస్సులు నడపడం జరుగుతుందని డిపో మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, జైనమందిర్, భద్రకాళీ టెంపుల్, వెయ్యి స్తంభాల గుడి, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బొగ్గట్ట వాటర్ పాల్స్, మేడారం, రామప్ప ఆలయాల దర్శనాలకు శని, ఆదివారాల్లో రాజధాని ఏసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీతో నడపడం జరుగుతుందని తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు మియాపూర్ నుంచి బయల్దేరి దర్శనాలనంతరం ఆదివారం రాత్రి 10 గంటలకు మియాపూర్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 98486 70640, 85003 09052, 96590 29882, 99592 26153లలో సంప్రదించాలని తెలిపారు.

సమస్యలను తొందరగా పరిష్కరిస్తా

రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న కాలనీ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల సమస్యలను తొందరగా పరిష్కరిస్తానని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు మంగళవారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం అందజేశారు. మార్కండేయనగర్ హనుమాన్ ఆలయం నుంచి బాబుల్‌రెడ్డినగర్ బాదాం రాములు షాప్ వరకు డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్య చాలా ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరాలకు అనుగుణంగా నిధులను మంజూరు చేయించి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జీహెచ్ఎంసీ వార్డు సభ్యులు సోమ శ్రీనివాస్, పల్లపు జగన్, రవిముదిరాజ్, ఓరుగంటి మల్లేశ్, సురేశ్, దుర్గాప్రసాద్, నవీన్, యాదయ్య, బక్కారెడ్డి, జంగీర్, ఆంజనేయులు, రాకేష్, గిరి, పోలా ప్రభాకర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తపై ప్రజలకు అవగాహన



శ్రీకృష్ణ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని ఆరోగ్యంగా ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాలతో 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపులో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లోని శ్రీకృష్ణ కాలనలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. పీరంచెరువు ప్రధాన రహదారిపై పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్ ప్రపక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ ఎం.యాదయ్య, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళోజీకి ఘన నివాళి



అత్తాపూర్‌లో..



కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

బండ్లగూడ: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అధికారులు, సిబ్బంది అందరూ కాళోజీ నారాయణరావు స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జేఏవో ఎం.స్వతి, జి.వెంకట్‌రెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు, అసిస్టెంట్లు, వార్డు అధికారులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీలత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు శ్రీనివాస్‌సాగర్, లింగరాజు, కవిత, ఉపాధ్యాయులు రజియాబేగం, పీడీ రంగారెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఫెడరేషన్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, కమ్యూనిటీహాల్, దోమల సమస్యలను పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ కోరారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయనను వంశీ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్రధానంగా ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను వివరించామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్ల వెంట వచ్చిన ఆక్రమణలతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, వాటిని తొలగించాలని కోరామన్నారు. మర్రిచెట్టు నుంచి భాగ్యలక్ష్మికాలనీ, ఫ్రెండ్స్ కాలనీ నుంచి నార్సింగి మున్సిపాలిటీ సరిహద్దుల వరకు రోడ్ల వెడల్పుకు టెండర్‌లు పిలిచినా కాంట్రాక్టర్‌లు రాకపోవటానికి కారణాలను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా దోమల సమస్య తీవ్రంగా ఉందని, వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పొలాల్లో కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలు



రషీద్‌గూడ శివారులోని పొలాల్లో చేతికి అందేలా ఉన్న కరెంట్ తీగలు



రషీద్‌గూడలో పొలాల్లో కట్టెలను చుట్టిన కరెంట్ తీగలు

శంషాబాద్ రూరల్: చేతికి అందెంత ఎత్తులో కరెంట్ తీగలు. దూర దూరంగా ఉన్న కరెంట్ స్తంభాలతో పొలాల్లో రైతులు సాగు చేసుకోవాలంటేనే భయపడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రషీద్‌గూడ శివారులో రైతుల పొలాల్లో కరెంట్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. తీగలు ఒకదానికి ఒకటి తగలకుండా రైతులు కట్టెల సహాయంతో దూరంగా ఉండేలా చేశారు. సమస్య పరిష్కారం కోసం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



సేవా పక్షం కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: సేవే మా మంత్రం, అభివృద్ధి మా లక్ష్యం అనే నినాదంతో బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో సేవా పక్షం సమావేశాన్ని నిర్వహించారు. పక్షం రోజుల పాటు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వివిధ సేవా కార్యక్రమాలను విజవంతం చేయాలని సూచించారు. అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 17న రక్తదాన శిబిరాలు, 18న విశ్వకర్మ జయంతి, 18న స్వచ్ఛ భారత్, 21న యోగా శిబిరాలు, పాదయాత్రలు, 25న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి, డిబేట్‌లు, క్విజ్ పోటీలు, క్రీడా పోటీలు,27న విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వక్తృత్వం పోటీలు, 28న భారతమాతా, వీర మాతల సత్కారం, అక్టోబర్ 2న మహాత్మ గాంధీ జయంతి, శుభ్రత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సేవా పక్షం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ..సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రతి కుటుంబాన్ని చేరడానికి కార్యక్రమాలు ఎంతగానో దోహదంచేస్తాయని అన్నారు. ప్రజల్లో చైతన్యం నింపేలా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, యశ్‌పాల్ గౌడ్, ఉపాధ్యక్షులు మూల అనీల్ గౌడ్ స్రవంతి, కార్యదర్శులు మణిభూషణ్, మాణిక్‌రావు, దుర్గా ప్రసాద్, సేవా పక్షం కో కన్వీనర్‌మార్ యాదవ్ పాల్గొన్నారు.